# వేదాంతభేరి

జూన్ 2021

రూ. 10/-

# వేదాంతభేరి

జూన్ 2021

రూ. 10/-

పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి

108వ జన్మదినమునాడు 108 శంఖాలతో అభిషేకానంతరం పూజ

చేయుచున్న కొత్త పీఠాధిపతి పూజ్యశ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

# ॐ వేదాంతభేరి ॐ

**సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు**

సంపుటము : 54 జూన్ 2021 సంచిక : 06

సంపాదకులు

**శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు**

సంపాదక మండలి

శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య, శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు, ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 2000/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు, విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు :

శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

> చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.

Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

# ఓం వేదాంతభేరి ఓం

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 54 జూన్ 2021 సంచిక : 06

## విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. హనుమంతుడు -శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 06
03. ధ్యానము - శ్రీసద్గురు మలయాళస్వాములవారు - 10
04. సాధన పంచకము - శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు - 12
05. శరీరము - శ్రీ సర్వాత్మానందగిరిస్వాములవారు - 15
05. శ్వేతాశ్వతరోపనిషత్తు -ఆచార్య శంకరానందగిరి స్వాములవారు-20
06. మంగళం - జయ మంగళం - ఆచార్య కె. సర్వోత్తమరావు- 24
07. పూజ్యశ్రీశ్రీశ్రీ పద్మనాభానంద సరస్వతి స్వాములవారి దివ్య సందేశము
డా ॥ ఎ.తారాలక్ష్మి - 29
08. వామనావతార ప్రశస్తి - ఆర్.శోభాదేవి - 34
12. శ్రీమదాంధ్ర భాగవతం - తృతీయ స్కందం
- ఆచార్య డా॥ జక్కంపూడి మునిరత్నం - 37
13. హరి పాఠము - శ్రీ జ్ఞానేశ్వర్ మహరాజు - 41
14. వార్తలు - 42

ముఖచిత్రం - శ్రీరామ భక్తహనుమాన్

**04-06-2021వ తేది శుక్రవారం హనుమజ్జయన్తి**

**21-06-2021వ తేది కూర్మ జయన్తి**

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు



## ప్రార్థన

**1.** ఉద్యదాదిత్య సంకాశం ఉదారభుజ విక్రమం,
కందర్ప కోటిలావణ్యం సర్వవిద్యావిశారదమ్ ।
శ్రీరామహృదయానందం భక్తకల్పమహీరుహం
అభయం వరదం దోర్భ్యాం కలయే మారుతాత్మజమ్ ॥

**2.** ఉల్లంఘ్యసింధోస్సలిలం సలీలం
యశ్శోకవహ్నిం జనకాత్మజాయాః ।
ఆదాయ తేనైవ దదాహ లంకాం
నమామి తం ప్రాంజలిరాంజనేయమ్ ॥

**3.** మనోజవం మారుతతుల్య వేగం
జితేన్ద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్ ।
వాతాత్మజం వానరయూధ ముఖ్యం
శ్రీరామదూతం శిరసా నమామి ॥

**4.** అపరాజిత పింగాక్ష ! నమస్తే రామపూజిత ।
ప్రస్థానంచ కరిష్యామి సిద్ధిర్భవతు మే సదా ॥

**5.** ఆయుః ప్రజ్ఞా యశో లక్ష్మీ శ్రద్ధా పుత్రాః సుశీలతా ।
ఆరోగ్యం దేహసౌఖ్యం మే దేహి నాథ నమోఽస్తు తే ॥

**6.** త్వత్పాదపంకజద్వంద్వం వినానాన్యం భజామ్యహమ్ ।
న్యూనాతిరిక్తం యత్కించిత్తత్సర్వం క్షంతుమర్హసి ॥

**7.** మాతా త్వంచ పితాత్వం చ భ్రాతా త్వం చ ప్రభుర్మమ ।
త్వామేవ శరణం ప్రాప్తం రక్షమాం కరుణానిధే ॥

**8.** యత్ర యత్ర రఘునాథకీర్తనం
తత్ర తత్ర కృతమస్తకాఞ్జలిమ్ ।
బాష్పవారి పరిపూర్ణలోచనం
మారుతిం నమత రాక్షసాంతకమ్ ॥

# హనుమంతుడు

**- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు**

ఉత్సాహము, నిర్భయత్వము, పవిత్రత, ప్రభుభక్తి, ఇంద్రియ నిగ్రహము.విద్యావైదుష్యము మొదలగు ఉదాత్త గుణములన్నియు హనుమంతుని యందు మూర్తీభవించియున్నవి.

హనుమంతుని శక్తిసామర్థ్యములు, బలపరాక్రమములు ఊహాతీత మైనవి. నూరు యోజనముల విస్తీర్ణం గల మహాసముద్రమును "సాగరం గోష్పదాయతే" అన్నట్లు అతను అవలీలగ దాటివైచెను. సముద్రమును లంఘించుటకు ఉపక్రమించు సమయమున హనుమంతుడు అమితోత్సాహముతో తక్కిన వానరులతో-"వాసవస్య సవజ్రస్య...గచ్ఛే యమితి మే మతిః " వజ్రాయుధ ధారియగు ఇంద్రుని చేతినుండి గాని, స్వయంభువగు బ్రహ్మదేవుని చేతినుండి గాని బలాత్కారముగా అమృతమును లాగికొని తత్క్షణమిచటికి తీసుకరాగలను. లంకనంతను భూమినుండి పెకలించి చేతితో ఎత్తుకొని రాగలను అను విశ్వాసం నాకు గలదు"- అని చెప్పెను. ఈ వాక్యములచే హనుమంతుని అలౌకిక సామర్థ్యము తేటతెల్లమగుచున్నది.

**హనుమంతుడు వినయశీలి :** హనుమంతుడు మహాబలోపేతుడై యున్నను అతనియందు అహంభావముగాని, స్వాతిశయ భావముగాని లేనే లేవు. సీతతో తన్నుగూర్చి పరిచయము చేయునపుడు తానొక సామాన్య తరగతికి చెందిన కోతి అనియు, తనకంటె అధిక పరాక్రమము కలవారు ఎందఱో కలరనియు చెప్పుకొనెను. రాక్షసులతో తన్ను గూర్చి చెప్పునపుడు 'నేను శ్రీరామచంద్రుని దాసానుదాసుడను' (దాసో ऽహం కోసలేంద్రస్య) అని చెప్పి తన విధేయతను ప్రకటించెను. సముద్రమును లంఘించు



సమయమున సూర్యునకు, ఇంద్రునకు, వాయుదేవునకు, బ్రహ్మదేవునకు, భూతలములకు చేతులు జోడించి నమస్కరించెను. ఈ క్రియలన్నియు హనుమంతుని నిరహంభావమును, వినయమును లెస్సగ సూచించుచున్నవి. లంకాపురియందు సీతాదేవిని దర్శించి, తిరిగి సముద్రమును దాటివచ్చి, ఆవార్తను వానరుల కెఱింగించి...

రాఘవస్య ప్రసాదేన భవతాం చైవ తేజసా ।

సుగ్రీవస్య చ కార్యార్థం మయా సర్వమనుష్ఠితమ్ ॥

'శ్రీరాముని కృపచేతను, మీయొక్క ప్రభావముచేతను, నేను సుగ్రీవుని కార్యసిద్ధికొఱకై అంతయు నెరవేర్చితిని'.. అని హనుమంతుడు వినయముతో చెప్పుకొనెను. తన విజయమునకు కారణము శ్రీరాముని అనుగ్రహమేయని సూచించెను. ఇట్టి నిరహంభావమే హనుమంతుని ఔన్నత్యమునకు ప్రబల హేతువైయున్నది.

**కార్యదీక్ష :** హనుమంతుడు ఏకార్యమునైనను సాధించువఱకు బద్ధకంకణుడై యుండును. మఱియు, ఆయాకార్యములను బాగుగ ఆలోచించి చేయుచుండును. శక్తికి వివేకమును జోడించును, బలమునకు చాతుర్యమును మిళితము చేయును. మైనాకుడు పర్వతముపై ఒకింత విశ్రాంతిని తీసికొనుమని ఎంత ప్రాధేయపడినను తాను రామకార్యమును సాధించు ప్రయత్నమందున్నానియు, మధ్యలో ఏమాత్రము విలంబము వాంఛనీయము కాదనియు చెప్పి ఆ పర్వతమును స్పృశించుటతో తృప్తి నొంది వెడలిపోయెను. హనుమంతుని కార్యదీక్ష, శ్రీరామకైంకర్యాభిలాష దీనిచే సువ్యక్తమగుచున్నవి. అట్లే లంకాపురియందు ప్రవేశించి, వానర రూపమున సీతను వెతకుచుండినచో రాక్షసులు గమనించుదురని తలంచి చిన్నరూపము ధరించెను. లంకాపురియందు సీతను వెదకి వెదకి ఆమె ఎచటను కానరా కున్నను అధైర్యపడక, ఉత్సాహమును సడలింపక, తన అన్వేషణ

కార్యక్రమమును దీక్షతో కొనసాగించెను. ఆ సందర్భమున హనుమంతుడు తనలో ఇట్లు చింతనజేసెను....

**అనిర్వేదః శ్రియో మూల మనిర్వేదః పరం సుఖమ్ ।**

**తస్మాదనిర్వేదకరం యత్నం చేష్టే ఽ హ ముత్తమమ్ ।**

హతాశుడు కాక ఉత్సాహముతో గూడియుండుటయే సంపత్తికి మూలకారణము. ఉత్సాహమే పరమ సుఖమునకు మూలకారణమై యున్నది. కాబట్టి ఇపుడు నేను ఇంకను ఉత్సాహపూర్వకమైన ప్రయత్నము కొఱకై చేష్టసల్పుదును'... ఈ ప్రకారముగ చింతన జేసి హనుమంతుడు పట్టుదలతో సీతాన్వేషణమును కొనసాగించి కృతకృత్యుడయ్యెను. హనుమంతుని కార్యదీక్షకు ఇది చక్కని ఉదాహరణ అయి యున్నది. అశోకవనమున సీతను చూచిన తరువాత ఆమెతో మాట్లాడక, ఆమెకు ధైర్యముచెప్పక, శ్రీరామ క్షేమవార్త ఆమెకు తెలిజేయక వెడలినచో, శ్రీరాముడు వచ్చులోపల ఆమె దుఃఖ భారముచే ఆత్మహత్య చేసికొనునేమోయను విచికిత్స జనింప తుదకు ఆమెతో సంభాషించి వెళుటయే ఉత్తమమని నిశ్చయించి ఆ ప్రకారముగ చేసెను.

సీతతో సంభాషించి ఆమె నుండి గుర్తుకై చూడామణిని గ్రహించి వెడలి పోవుచు హనుమంతుడు ఈప్రకారముగ చింతన చేసెను... 'ఎవడు ప్రధానమైన కార్యమును పూర్తి చేసిన పిదప దానికి బాధ కలుగనివ్వక ఇంకను కొన్ని కార్యములను నెరవేర్చునో అతడే కార్యదక్షుడు. ఎవడు ఏకార్యమునైనను అనేక విధములుగ సిద్ధింపజేయుకళ ఎఱుంగునో అతడే కార్యసమర్థుడు'... ఇట్లు విచారణ సలిపి ప్రమదావన నాశనము, రాక్షసవధ, లంకాదహనము మొదలగునవి కావించెను. హనుమంతుని ఆలోచనా శక్తి, కార్యతత్పరత, దూరదృష్టి ఈ కార్యములచే స్పష్టమగుచున్నవి.



**దౌత్య వైశిష్ట్యము :** హనుమంతుడు దౌత్యమునందు ఆరితేరినవాడు. కిష్కింధయందు మతంగపర్వతసమీపమున రామలక్ష్మణులు సంచరించు చుండ వారెవరో తెలిసికొని రమ్మని సుగ్రీవుడు హనుమంతుని పంపగా హనుమంతుడు మాట్లాడినరీతిని, స్పష్టభాషణమును, శ్రీరాముడు సైతము చాల మెచ్చుకొనెను. సుగ్రీవునితో రామలక్ష్మణులు మైత్రిని గలుపుటకు హనుమంతుడు తన చాతుర్యముచే క్షేత్రమును సిద్ధముచేసి పెట్టెను. చక్కని దౌత్యమును నెఱపెను. అట్లే శ్రీరాముని దూతగ లంకకు వెళ్ళి; రావణునకు ఎంతబోధించవలెనో, ఎట్లు బోధించవలెనో, అంతయు బోధించి, మర్యాదగా సీతను రామునకిచ్చివేయవలసినదనియు లేనిచో, తాను, తనవంశము, లంకాపట్టణము మొత్తము సర్వనాశమైపోగలవని ధైర్యముతో విస్పష్టముగ చెప్పెను. హనుమంతుని దౌత్యనిపుణత్వమును బాగుగ నెఱిగియున్న శ్రీరాముడు యుద్ధానంతరము పుష్పక విమానముపై స్వదేశమునకు తిరిగి వచ్చుచు, ముందుగా భరతుని యొద్దకు, అయోధ్యకు తనరాక నెఱిగించుటకై హనుమంతుని పంపియుండెను.

దూతగ వెడలి రామకార్యమును సమర్థవంతముగ నెరవేర్చుకొని తిరిగివచ్చి శ్రీరామునకు ప్రణమిల్లి సీతయొక్క ఉనికిని గూర్చి శ్రీరామునికి నివేదించి ఆమె గుర్తు కొఱకై యిచ్చిన చూడామణిని చూపించగా శ్రీరాముని హృదయము అనందముతో ఉప్పొంగిపోయెను. అతడు చేసిన మహో పరాకమునకు కృతజ్ఞత ఏ విధముగ చెల్లించవలెనో యను ఆలోచనలో పడి చివఱకు ప్రేమతో అతనిని కౌగలించుకొని సంతృప్తిపడెను.

హనుమంతుడు వానర శరీరమును ధరించియున్నను తన ప్రయత్నాతిశయంచే మానవత్వమును, దేవత్వమును దాటి సాక్షాత్ దేవుడే అయి వెలయుచున్నాడు. కనుకనే శ్రీరాముని ఆలయములతోబాటు హనుమంతుని దేవాలయములు కూడ వెలసియున్నవి. జనులతనిని సాక్షాత్ దేవునిగనే ఆరాధించుచున్నారు.

# ధ్యానము

**- శ్రీ సద్గురు మలయాళస్వాములవారు**

**(గత సంచిక తరువాయి)**

మీరు ఎవరితోనైన మాటలాడుచుండగా నితర శబ్దములు వినరావు. దేనిని గురించి దీర్ఘచింతన చేయుచుండిన, వాసన గ్రహించుటగాని శబ్దము వినుటగాని దృష్టిలో ఏదైన గోచరించుటయుండదు. దీనివలన ఏమి గోచరించుచుండుననగా ఏకాగ్రతచేత దృశ్యము మరచిపోబడుచున్నదనియు, వ్యక్తము గాని విషయము సువ్యక్తమగుచున్నదనియు, తేలుచున్నది.

మీరు కొన్ని శ్లోకములనుగాని, కీర్తనలుగాని, కంఠస్థపాఠముగా నేర్చుకొని యందురు. అయినను వానిని పఠించునపుడు మనస్సు వేరే దేనిపై పోయినను మీరు ఆ శ్లోకములను కీర్తనలను చక్కగా గానము చేయజాలరు గదా !

ఇదే నిస్సంకల్పముగా యుండవలెనని చెప్పెడు రహస్యము. హృదయ సరోవరమున సంకల్పములు అలలవంటివి. అలలు వుండిన ఆ జలములో రాత్రికాలమున చంద్ర ప్రతిబింబము కానుపింపదు గదా! ఆలాగున నిస్సంకల్ప స్థితి అందని వారికి హృదయస్థుడగు పరమాత్మ దర్శనము లభింపదు.

ఇంకొక రహస్యము చెప్పెద, మూర్తియు, పూజయున్ను లేనినాడు దేవాలయము ఎట్లు వ్యర్థమో, ఆలాగున మీదేహమను క్షేత్రములో భగవత్స్వరూప స్మరణ లేక ఆత్మభావనయు, కరుణయగు జలాభిషేకమున్ను, శాంతము, సత్యము, దయ, విరక్తి, తపస్సు అనెడు పుష్పములున్ను, సర్వేశ్వరధ్యానానందము లేక, భుక్తిలో మునిగిన అమృతమగు నైవేద్యమున్ను లేనిచో ఈ జన్మము వ్యర్థమేగాక భూమికి భారమని గూడ మఱవకుడు.

ఈ ధ్యానమును చేయకపోవుటచేతనే జ్ఞానవిహీనులగుచున్నారు. పతివ్రతయైన స్త్రీ భర్తకు భోజనము పెట్టకముందుగా, వండి తాను



భుజించుట ఎంత పాతకమో, గురుశుశ్రూషాతత్పరుడైనవాడు భిక్షాన్నము తెచ్చిగాని, పచనము చేసిగాని, గురుస్వాములకు పెట్టుటకు ముందుగా తినువాడు ఎట్టి దుష్టగుణములుగలవాడో, దేవతార్చన చేయువాడు నైవేద్యము నొనగూర్చి స్వామికి ఆరాధన చేయుటకు ముందుగా ఆ నైవేద్యమును భుజించువాడెంత పాపియో, ఆలాగున మీ ఆత్మారాధనము చేయుటకు ముందుగా అనగా, ఈశ్వరధ్యానమును పూజచేయుటకు ముందుగా నశ్వరమగు ఈ శరీరమును పోషించువాడు గూడా పాపజన్మముగలవాడనియే తలంచవలెను.

దయయే స్వరూపముగల సోదరులారా ! సోదరీమణులారా! మీరందరున్ను, ఒక్క వ్రతమునవలంబించిన మాత్రమే ఈ దుఃఖసాగరము నుండి తరింపగలరు. ఆ వ్రతమేమన మీ యొక్క ఆత్మారాధనపరమగు దైవప్రార్థనలు జరుపక అన్నపానాదులు చేయరాదని వ్రతమును గట్టిగా పట్టుడు. ఈ వ్రతము ప్రారంభదశలో చాలా ప్రయాసముగా గానుపించును. అయినను ఈ సంయమ వ్రతమును అనుష్ఠించు వారిని ప్రకృతి తన నిరంకుశత నుండి తొలగించును.

సముద్రములో అలలు శాంతమైన తరువాత స్నానము చేయుటకు నిరీక్షించుచుండిన సమయము దొరకనట్లు ఈ సంసారసాగరములో నుండక సమస్త కార్యములు ప్రశాంతమైన తరువాత మీకు బ్రహ్మనిష్ఠ చేయుటకు ప్రసన్నమైన కాలమొక్కటి లభించునని తలంచి మోసపోకుడు.

మీరు జేయు ధ్యానము సాధ్యమైనంత వరకు ప్రతిదినము ఒకటే సమయమున ధ్యానించి, శీలించవలెను. అట్లయిన ఆ సమయము వచ్చునపుడు ఇంద్రియార్థముల నుండి ఇంద్రియములు స్వయముగా ఆత్మాభిముఖమై తిరుగుచుండును.

మనయొక్క ఆత్మయను ప్రభువు ధ్యానమనెడు విహారకాలము తప్పక ఏర్పాటు చేసుకొనినచో, ఇంద్రియములనెడు భృత్యులందరున్ను, అప్పుడు అప్రయత్నముగా వశవర్తులైయుందురు. కనుక మీరు ధ్యానము జరుపక భోజనము జేయరాదని ఒక్క వ్రతము నేర్పాటు చేసుకొనవలెను.

## సాధన పంచకము

**- శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు**

**( గత సంచిక తరువాయి )**

ఏకాన్తే సుఖమాస్యతాం పరతరే చేతస్సమాధీయతామ్

పూర్ణాత్మా సుసమీక్ష్యతాం జగదిదం తద్బాధితం దృశ్యతామ్ ।

ప్రాక్కర్మ ప్రవిలాప్యతాం చితిబలాన్నాప్యుత్తరైః శ్లిష్యతామ్ ।

ప్రారబ్ధం త్విహభుజ్యతామథ పరబ్రహ్మాత్మనాస్థీయతామ్ ॥

సాధకుడైన మానవుడు ప్రారంభ దశలో జనములేని ప్రదేశము నందు సుఖంగా కూర్చొనబడవలయును. పరమాత్మ తత్వమునందే మనస్సును బాగుగా ఉంచబడవలయును. సర్వ వ్యాపకమైన పరమాత్మను బాగుగా చూడబడవలెను. ఈ నామరూపాత్మకమైన ప్రపంచము బ్రహ్మ విచారణచే బాధింపబడినదిగా చూడబడవలెను. సంచిత కర్మము నష్టము చేయబడవలెను. జ్ఞానబలముచే ఆగామికర్మను దగ్ధము చేసి వాటితో అంటుకొనబడకుండవలెను. ఈ లోకములో ఈ జన్మమునందే ప్రారబ్ధమైతే అనుభవింపబడవలెను. తదుపరి స్వస్వరూపమైన పరబ్రహ్మ రూపముగా నుండవలెను. అనిశ్లోక భావము.

**ఏకాన్తే సుఖమాస్యతామ్ ।**

ఏకాంతమనగా-నిర్జనం-జనులు లేని ప్రవేశము. నియమితమైనది. ప్రతిబంధము లేని ప్రదేశము. ఈ విధమైన అర్థములుగలవు. 'ఏకః అంతః నిశ్చయః యత్రతత్ ఏకాంతం' ముఖమైన నిశ్చయము గలది అని అర్థం. సాధకుడైన మానవుడు ప్రథమంగా, శబ్దాది విషయములకు దూరంగా



యుండి, ధ్యేయమునందు నిశ్చయాత్మకాంతఃకరణముగు బుద్ధి గలిగినవాడై క్రూరమృగములు సంచారములేని ప్రదేశములలో జపధ్యానాదులను బాగుగా శీలించుచూ, ఏకాగ్రత సిద్ధికొరకు సాధన చేయవలెను. మనస్సు జాగ్రదవస్థలో శబ్దస్పర్శరూప రసగంధాదుల వశమై వాటిలోనే డోలాయమానమై తద్విషయముల యందాసక్తిని పొందియుండును. కావున వీటికి గురికాని ఏకాంత ప్రదేశంలో సాధన చేసిన శీఘ్రముగా ఏకాగ్రత సిద్ధించును. దీనివలన మనస్సునకు ఆనందము గలుగును.

ప్రస్తుత కాలములో అడవులలో ఏకాంతగా ఉండునేమోయని తలచి అడవులకు వెళ్లరాదు. అచ్చటను క్రూరజంతువులు, పాములు, దోమలు, ఈగలు మొదలగునవి యుండును. వీటి వలన భయము గలిగి వాటిని దూరం చేయాలనే ఆలోచనలు గలిగియుండును గాని సాధన దృష్టి ఉండదు. తన గృహములోనే ఏకాంత సమయమును ఏర్పరుచుకొని సాధన చేయవలెను. అనన్తరము శ్రవణ, మనన నిదిధ్యాసలు ద్వారా ఏకాంత శబ్ద వాచ్యమైన పరబ్రహ్మమును తెలుకొని, స్వస్వరూపమునందు సుఖముగా నుండమనీ 33వ సాధనలో శ్రీశంకరాచార్యుల వారు దెలిపిరి.

**పరతరే చేత స్సమాధీయతామ్ ।**

పరమాత్మయందే మనస్సును బాగుగా వుంచవలెను.

పరతరే = పరమాత్మ తత్వమునందు అని అర్థము. పరమాత్మ యందు చిత్తము స్థిరముగా యుంచాలంటే, చిత్తములో యున్న సంస్కారములు ఆత్మవిచారణ జ్ఞానముతో నశింపజేయవలెను. నిత్యానిత్య వస్తు వివేకము, ఇహాముత్ర ఫలభోగవిరాగము, శమము, దమము,ఉపరతి, తితిక్షా, శ్రద్ధా, సమాధానము అనే శమాది షట్క సంపత్తిని బాగుగా శీలించిన వారికి

చిత్తము స్వాత్మయందు నిలచును. పతంజలి మహర్షియును "యోగశ్చిత్త వృత్తి నిరోధః "చిత్త వృత్తులను నిరోధించుటయే" యోగమన్నారు. యమాది ప్రత్యాహార. ధారణ, ధ్యాన, సమాధి అని అష్టాంగములు చిత్తైకాగ్రత సిద్ధి కొరకు చెప్పి ప్రకృతి పురుష వివేకమనెడి అసంప్రజాత సమాధిచేత వేగిన శనగ గింజవలె, యోగిసంస్కారములు దగ్ధమగును అని చెప్పారు. యోగ వాసిష్ఠములోను వాసనాక్షయమే మోక్షమన్నారు. కావున తన మనస్సు పరమాత్మ యందు లయము కావాలంటే, కేవలము, పూజా, జప, ధ్యానము, సేవాదులచే తృప్తి పడక తన చిత్తములోనున్న రాగద్వేష, ఈర్ష్యాసూయాదులనే వృత్తులను, అనగా రజోగుణ తమోగుణాత్మకములగు మోక్ష ప్రతి బంధకములగు మాలిన్య వృత్తులను ఆత్మజ్ఞాన విచారణచే నశింపజేయ వలెను. ఇదే నిజమైన సాధన. ప్రతి దినము ముఖము అద్దములో చూచుకొను చున్నాము. ముఖ మాలిన్యము పోగొట్టుకొనుచున్నాము. ఆ విధముగానే శాస్త్రమనేది మన అంతర్ముఖమునకు అద్దము లాంటిది. మరియు మహాత్ముల ప్రవచనములును అద్దము లాంటివే. వీటి ద్వారా అంతర్ముఖమైన చిత్త వృత్తులను పోగొట్టు కొనవలెను. అపుడే పరతత్వము నందు చిత్తము నిలచి సుఖమును పొందుదుము. అని 34 సాధనలో శ్రీ ఆచార్యుల వారు దెలిపిరి.

**వేదాన్తభేరినిధికి ఈ క్రిందివారు తమ పోషక చందా పంపినారు**

| | |
|---|---|
| 1. దన్నపనేని వెంకటరామారావు (ఈదర) | - రూ.2000/- |
| 2. జి. ఏడుకొండల స్వామి (బెంగుళూరు) | - రూ.2000/- |
| 3. కందుల కనకదుర్గాదేవి (విశాఖపట్నం) | - రూ.2000/- |
| 4. రౌతు తిరుపతిరావు (కణ్ణివలస) (మరల అదనంగా) | - రూ.1500/- |
| 5. పి.నాగభూషణం (నందిపేట) (అదనంగా రెండోమారు) | -రూ.2000/- |
| 6. ఎ.ఎ.ఎస్.రాజు (హైదరాబాద్) (భేరి నిధికి) | - రూ.5116/- |



# శరీరము

- శ్రీ సర్వాత్మానందగిరి స్వాములవారు

**"వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరో ఽపరాణి ।**
**తథా శరీరాణి విహాయ జీర్ణాన్యన్యాని సంయాతి నవాని దేహీ ॥"**

అనే శ్రీమద్భగవద్గీత శ్లోకము తెలియని హిందువులు బహుశః వుండరు. అరిగిపోయిన లేక చిరిగిపోయిన వస్త్రాలను వదలిపెట్టి మనిషి కొత్త వస్త్రాలను ధరిస్తాడు. అదేవిధంగా కృశించి క్షీణించిపోయిన శరీరాలను వదలిపెట్టి జీవి నూతన శరీరాలను పొందుతాడు అని శ్లోకతాత్పర్యము.

శరీరము అనే శబ్దము కేవలము మనిషి శరీరానికి మాత్రమే పరిమితము కాదు. సృష్టిలో గల సకల స్థావర జంగమాలు అంటే దేవదానవ మానవ వృక్ష పర్వత పశుపక్షి కీటక సహితమైన భూచర ఖేచర జలచరాది 84 లక్షల ఉపాధులన్నీ శరీరాలే. మానవ శరీరముయొక్క గొప్పదనాన్ని గురించి కొంత తెలుసుకుందాము.

ప్రకృతియొక్క అహంకార శక్తిలోని తామసగుణమునుండి ఆకాశ వాయు అగ్ని జల పృథువులనే పంచభూతాలు కల్పించబడ్డాయి. ఆ పంచభూతాల నుండి త్వక్ మాంస రుధిర అస్థి మజ్జస్నాయు మేదస్సు ( చర్మమాంస రక్త ఎముక కొవ్వు నరాలు మెదడు) లనబడే సప్తధాతువులు ఏర్పడి వాటి ద్వారా శరీరము ఏర్పడింది.

ఈ శరీరము కేవలము ఆహారము మాత్రమే. పురుషుడు భుజించిన ఆహారసారమైన వీర్యము వలన స్త్రీ గర్భమందు శరీరాంకురము ఏర్పడుతుంది. కాలగతిలో స్త్రీ భుక్త ఆహార రసరూపమైన రక్తము ద్వారా క్రమంగా వృద్ధిని

సొందుతూ జీవచైతన్య సహితమై 9 నెలలకు పూర్ణమైన శరీరరూపాన్ని పొందుతుంది. ప్రపంచములోకి వస్తుంది. ఆ తరువాత గూడా ఆహారసారమైన తల్లిపాల ద్వారానే శరీరము పోషించబడుతూ, తదుపరి స్వయంగా చతుర్విధాహారాన్ని స్వయంగా భుజిస్తూ పూర్ణమైన మనిషిగా మారుతుంది. కాబట్టి శరీరము అంటే ఆహారము యొక్క మారురూపము మాత్రమే అని తేలింది. గమనించవలసిన విశేషమేమిటంటే - శరీరము ఏర్పడటములోగానీ, అది పెరగటములో గానీ ఎవరి యొక్క పాత్ర కూడా లేదు. అదంతా కేవలము ప్రకృతి వల్లనే జరిగిపోతున్నది. తల్లి గానీ ఇతరులెవరైనా గానీ కేవలము ఆహారాన్ని ఆ శరీరానికి అందించటము మాత్రమే చెయ్యవలసినది, లేక చెయ్యగలిగేది. అందుచేత పిల్లలను నేను కన్నాను పెంచాను అనే కర్తృత్వము మనిషికి ఉచితము కాదు. ఆ విధంగా భావించడము అవివేకము మాత్రమే అని శ్రీ మద్భగవద్గీత మూడవ అధ్యాయములో తెలిపాడు భగవానుడు...

**"ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః ।**

**అహంకార విమూఢాత్మా కర్తాహ మితి మన్యతే ॥ " - 3-27**

ఇక శరీరము ఏవిధంగా తన నిర్వహణను చేసుకుంటుందో పరిశీలిద్దాము. శరీరము తన ఆహారాన్ని దాని చేతిద్వారానే నోటిలో వేసుకుని కడుపులోనికి పంపుతుంది. ఒకవేళ నేను తింటున్నాను అని అనుకున్నా గూడా అది ముద్దను మింగడము వరకే పరిమితము. మింగిన ఆహారము మీద మనిషికి ఎటువంటి అధికారమూ వుండదు. శరీరమే కడుపులోని ఆహారాన్ని బాగా పచనము చేసి వివిధ భాగాల ద్వారా దాన్ని రక్తాది సప్త ధాతువులుగా మార్చుకుని ఓజస్సు సహబలాలు (మనోబలం, ఇంద్రియ బలము,శరీరబలము) కలిగించి దానికి వ్యాపార సామర్థ్యాన్ని



కల్పించుకుంటుంది. ఈ ప్రక్రియలో మనిషికి కర్తృత్వము ఏమాత్రమూ లేదు.

కదాచిత్తు శరీరము లోపల ఏదైనా దోషము కలిగితే ఆ దోషాన్ని పరిహరించు కొనడానికి తానే అనేక ప్రయత్నాలను చేసుకుంటుంది. తనుగ్రహించిన ఆహారము నుండే దోషనివారణకు తగిన ఔషధాలను తయారు చేసుకుంటుంది. ఆ ఔషధాల విలువను కట్టలేము. ఈనాడు అనేకులు ప్రసిద్ధంగా వాడుకుంటున్నది ఆర్.ఓ. మంచినీటి యంత్రము. అది నీటిలోని అన్ని రకాల మాలిన్యాలను తొలగించి చాలా శుద్ధమైన జలాన్ని తయారు చేస్తుంది. ఐతే ఇటువంటి యంత్రము శరీరములో సహజంగానే ఏర్పాటై వుంది. ఆ యంత్రాన్ని వాడుకోనందు వలన అది క్రమంగా పనిచెయ్యడము మాని, శుద్ధమైన త్రాగునీటిని బయటి నుండి సంపాదించే అవసరాన్ని కలగజేస్తున్నది. కానీ పశుపక్షిమృగాదులన్నీ ప్రకృతిలో సహజంగా లభించే నీటినే త్రాగి కూడా ఆరోగ్యవంతంగా జీవించగలుగుతున్నాయి. ఒకవేళ దోషనివృత్తిని తను చేసుకోలేక పోతే అప్పుడు తత్సంబంధితమైన లక్షణాలను బయటికి ప్రకటింప జేస్తుంది. నొప్పి, పోటు, దురద, మంట, జలుబు, జ్వరము, తల తిరుగుట , విరేచనాలు ఇత్యాదులన్నీ దోషాన్ని ప్రకటించే శరీరభాషయే అని గ్రహించాలి. దాని భాషను సక్రమంగా గ్రహించి ఉచిత ఔషధాలు చికిత్సలు దానికి అందజేస్తే తానే వాటిని ఉపయోగించుకుని ఆదోషాన్ని తొలగించుకుని తిరిగి ఆరోగ్యవంతంగా వుంటుంది. తనకు ఉచితమైన చికిత్స లభించే వరకు దాని యజమాని మీద తన తిరుగుబాటును విరమించుకోదు.

ఐతే శరీరపు యజమాని దాని తత్వాన్ని బాగా అర్థము చేసుకుని. ఇంద్రియాల రుచులకు బానిస కాకుండా, ఆరోగ్యకరమైన ఆహారాన్నే

అందిస్తూ ఉచిత రీతితో దాన్ని పనిచేయించుకుంటే అది స్వస్థతగా వుండి దీర్ఘకాలము మంచి సేవను అందించగలుగుతుంది. ప్రపంచములో మనిషి తప్ప ఇతర ప్రాణులన్నీ వాటి ప్రకృతి సహజమైన ఆహారాన్ని మాత్రమే గ్రహిస్తూ తగినంత శరీర పరిశ్రమను చేస్తూ ఎంతో ఆరోగ్యంగా జీవించ గలుగుతున్నాయి. ఉదయాన్నే పళ్ళుతోము కోవడము, స్నానము చెయ్యడము ఇత్యాది నియమాలను అని పాటించక బోయినా వాటి పళ్ళు ఊడి పోవడము, శరీరము దుర్గంధ యుక్తము కాకబోవడము గమనార్హము.

ఇక శరీరాన్ని ఎందుకు సంపాదించామో అనే దాన్ని మరిచి దాన్ని చివరి వరకు ఆరోగ్యం గానూ బలంగానూ, అందంగానూ పెట్టుకునే ప్రయత్నాలను మాత్రమే నిరంతరముగా చేసుకుంటూ జీవితాన్ని సుఖంగా గడుపుదాము అన్న ఆలోచన అవివేకమైనదే. తాజాగా వున్న ఫలాలు, కూరలు ఎంతకాలము ఆవిధంగానే వుండగలవు? ఫ్రిజ్‌లో వుంచినా కూడా ఎల్లకాలము చెడిపోకుండా వుండలేవు గదా! మనిషి తినే ఆహారాన్ని గురించి విచారిస్తే - ఉదయాన వండిన ఆహారము సాయంత్రానికి చెడిపోతున్నది, అటువంటి ఆహారంతో పోషించబడే ఈ దేహాన్ని గురించి ఏమిటి చెప్పడము ? శరీరాలు సకాలంలోనో లేక అకాలంలోనో నశించి పోవడమో, వికలమైపోవడమో అన్నది అనివార్యము. సకాల మృత్యువు లేకుండా వరాలను పొందిన హిరణ్యకశిపుడిని అకాల మృత్యువు కబళించింది గదా!

అందుచేత వీలైనంత శీఘ్రంగా శరీరముతో సాధించుకొనవలసిన స్వస్వరూప (ఆత్మస్థితి) స్థితిని గట్టి ప్రయత్నంచేత చేరుకోవాలి. శరీరముతో కేవలము లౌకిక విషయానుభవములోనే మునిగిపోకుండా సత్యము, శాశ్వతము, నిరతిశయము, అద్వితీయము ఐన ఆనంద ధామానికి



చేరడానికి, పరమాత్మ తత్త్వ శ్రవణ మనన నిధి ధ్యాసలు అనే సాధనను చెయ్యాలి. మరణించే శరీరంతో అమృతత్వాన్ని పొందాలి. శరీరమంతా అమేధ్య (అపవిత్ర) పదార్థమయమైనదే. ఐనా గూడా, ఒక ఎండిపోయి చీకిపోయిన చెక్కమొద్దు నీటిలో మునిగిన వాడికి ఆధారమై ఒడ్డుకు చేరడానికి సహాయ పడినట్టు, శరీరము జీవికి సంసార తీరానికి చేరడానికి సహాయము చేస్తుంది.

**"యదిహ చే దశక ద్బోద్ధుం ప్రాక్శరీరస్య విస్రసః**
**తత స్సర్గేషు లోకేషు శరీతత్వాయ కల్పతే " - కఠోపనిషత్ 2-3-3**

అంటే శరీరము నశించడానికి పూర్వమే ఎవడు ఆత్మస్థితిని పొందడో అతడు అనేక యోనులతో పుట్టుకలను పొంది, యాతనలనుభవిస్తూ, సంసారంలో తిరుగుతాడని తాత్పర్యము.

ఇంతటి మహామహిమాన్వితమైన శరీరాన్ని శీఘ్రంగా సద్వినియోగం చేసుకుందాము. **ఓం తత్ సత్**

**త్రినేత్ర వైద్యాలయ ట్రస్టు నిధికి ఈక్రింది వారు పైకం పంపినారు**

1. అట్ల నరసింహారెడ్డి, స్వరూప గార్లు - రూ. 15000/-
(తిమ్మ సముద్రం )
2. ఎం. వెంకటరెడ్డి, మంగాయమ్మ గార్లు - రూ. 10000/-
(రావులపాళెం )
3. జి.వి.కె. కిశోర్ (అనుపురం, తమిళనాడు) - రూ. 15000/-

**సద్గురు సర్వ సేవా ట్రస్టు నిధికి ఈక్రింది వారు పైకం పంపినారు**

1. ఎ.ఎస్.ఎన్.విజయలక్ష్మి ,(హసన్, కర్నాటక )- రూ. 20,000/-

అందిస్తూ ఉచిత రీతితో దాన్ని పనిచేయించుకుంటే అది స్వస్థతగా వుండి దీర్ఘకాలము మంచి సేవను అందించగలుగుతుంది. ప్రపంచములో మనిషి తప్ప ఇతర ప్రాణులన్నీ వాటి ప్రకృతి సహజమైన ఆహారాన్ని మాత్రమే గ్రహిస్తూ తగినంత శరీర పరిశ్రమను చేస్తూ ఎంతో ఆరోగ్యంగా జీవించ గలుగుతున్నాయి. ఉదయాన్నే పళ్ళుతోము కోవడము, స్నానము చెయ్యడము ఇత్యాది నియమాలను అని పాటించక బోయినా వాటి పళ్ళు ఊడి పోవడము, శరీరము దుర్గంధ యుక్తము కాకబోవడము గమనార్హము.

ఇక శరీరాన్ని ఎందుకు సంపాదించామో అనే దాన్ని మరిచి దాన్ని చివరి వరకు ఆరోగ్యం గానూ బలంగాను, అందంగానూ పెట్టుకునే ప్రయత్నాలను మాత్రమే నిరంతరముగా చేసుకుంటూ జీవితాన్ని సుఖంగా గడుపుదాము అన్న ఆలోచన అవివేకమైనదే. తాజాగా వున్న ఫలాలు, కూరలు ఎంతకాలము ఆవిధంగానే వుండగలవు? ఫ్రిజ్‌లో వుంచినా కూడా ఎల్లకాలము చెడిపోకుండా వుండలేవు గదా! మనిషి తినే ఆహారాన్ని గురించి విచారిస్తే - ఉదయాన వండిన ఆహారము సాయంత్రానికి చెడిపోతున్నది, అటువంటి ఆహారంతో పోషించబడే ఈ దేహాన్ని గురించి ఏమిటి చెప్పడము ? శరీరాలు సకాలంలోనో లేక అకాలంలోనో నశించి పోవడమో, వికలమైపోవడమో అన్నది అనివార్యము. సకాల మృత్యువు లేకుండా వరాలను పొందిన హిరణ్యకశిపుడిని అకాల మృత్యువు కబళించింది గదా!

అందుచేత వీలైనంత శీఘ్రంగా శరీరముతో సాధించుకొనవలసిన స్వస్వరూప (ఆత్మస్థితి) స్థితిని గట్టి ప్రయత్నంచేత చేరుకోవాలి. శరీరముతో కేవలము లౌకిక విషయానుభవములోనే మునిగిపోకుండా సత్యము, శాశ్వతము, నిరతిశయము, అద్వితీయము ఐన ఆనంద ధామానికి



చేరడానికి, పరమాత్మ తత్త్వ శ్రవణ మనన నిధి ధ్యాసలు అనే సాధనను చెయ్యాలి. మరణించే శరీరంతో అమృతత్వాన్ని పొందాలి. శరీరమంతా అమేధ్య (అపవిత్ర) పదార్థమయమైనదే. ఐనా గూడా, ఒక ఎండిపోయి చీకిపోయిన చెక్కమొద్దు నీటిలో మునిగిన వాడికి ఆధారమై ఒడ్డుకు చేరడానికి సహాయ పడినట్టు, శరీరము జీవికి సంసార తీరానికి చేరడానికి సహాయము చేస్తుంది.

**"యదిహ చే దశక ద్బోద్ధుం ప్రాక్శరీరస్య విస్రసః**
**తత స్సర్గేషు లోకేషు శరీతత్వాయ కల్పతే " - కఠోపనిషత్ 2-3-3**

అంటే శరీరము నశించడానికి పూర్వమే ఎవడు ఆత్మస్థితిని పొందడో అతడు అనేక యోనులతో పుట్టుకలను పొంది, యాతనలనుభవిస్తూ, సంసారంలో తిరుగుతాడని తాత్పర్యము.

ఇంతటి మహామహిమాన్వితమైన శరీరాన్ని శీఘ్రంగా సద్వినియోగం చేసుకుందాము. **ఓం తత్ సత్**

**త్రినేత్ర వైద్యాలయ ట్రస్టు నిధికి ఈక్రింది వారు పైకం పంపినారు**

1. అట్ల నరసింహారెడ్డి, స్వరూప గార్లు - రూ. 15000/-
(తిమ్మ సముద్రం )
2. ఎం. వెంకటరెడ్డి, మంగాయమ్మ గార్లు - రూ. 10000/-
(రావులపాలెం )
3. జి.వి.కె. కిశోర్ (అనుపురం, తమిళనాడు) - రూ. 15000/-

**సద్గురు సర్వ సేవా ట్రస్టు నిధికి ఈక్రింది వారు పైకం పంపినారు**

1. ఎ.ఎస్.ఎన్.విజయలక్ష్మి ,(హాసన్, కర్నాటక )- రూ. 20,000/-

# శ్వేతాశ్వతరోపనిషత్తు

## శ్రీ శంకర భగవత్పాదులవారి సంబంధ భాష్యానువాదము

**అనువాదకులు - ఆచార్య శంకరానందగిరి స్వాములవారు, (పెనమలూరు) (పూజ్యశ్రీ స్వాములవారు మే 8వ తేదీన బ్రహ్మాలీనులయ్యారు. వారికి మా శ్రద్ధాంజలి.నం) ( గత సంచిక తరువాయి )**

**అనువాదం** - బ్రహ్మాపురాణంలో చెప్పబడిన విషయం - ధర్మాధర్మాలు, సుఖదుఃఖాలు, జన్మ మృత్యువుల కల్పన, వర్ణాశ్రమ విభాగం, స్వర్గనరకాల్లో వుండడం ఇవన్నీ జ్ఞానికి వుండవు. ఎండమావుల్లో నీరు ప్రతీతమైనట్లు జగత్తు అసత్యస్వరూపమయినా సత్యస్వరూపంగా గోచరిస్తూ వుంది. వాస్తవికంగా ముత్యపుచిప్ప ముత్యపుచిప్పయే కాని అది వెండిరూపంలో భాసిస్తూ వుంటుంది. మందాంధకారంలో త్రాడు పాముగా భాసిస్తూ వున్నట్లు, నేత్రదోషం వున్నవారికి ఆకాశంలో నీలరూపం స్నిగ్ధత్వంగా ప్రతీతమయినట్లు జగత్తు మిథ్య అయినప్పటికీ సత్యరూపంలో భాసిస్తుంది. జలాశయాలలో ఒకే సూర్యుడు అనేకంగా చూడబడినట్లు సర్వోపాధుల్లో పరమాత్మ గూడ ఆయా రూపాల్లో భాసిస్తూ వున్నాడు. ఇది అవిద్యాభ్రాంతివికల్పమే కాని వాస్తవికంకాదు. భ్రాంతిచేత ఈ శరీరాన్నే ఆత్మగా భావించినట్లు దేహాభిమానులకు ఈ దేహమే మరణానంతరం పరలోకంలో బంధనాగారమవుతుంది. (అనగా వారు తిరిగి జన్మను పొందవల్సి వుంటుంది). ఆది మధ్యాంతములలో సర్వదా భ్రమరూపమయిన దానియందు జాగ్రత్స్వప్న సుషుప్తి ఈ మూడవస్థలతో విశ్వ తైజస ప్రాజ్ఞులు గూడ ఆచ్ఛాదింపబడి వున్నారు. జీవుడు తన ద్వైతరూపమాయచేత తనను తానే మోహింప జేసుకుంటాడు. అలాగే స్వయం తన అంతఃకరణంలో వున్న ఆత్మభూత పరమాత్మను పొందుతాడు. ఆకాశంలో పిడుగులయొక్క అనేక అగ్నిజ్వాలలు కనుపించినట్లు పరమాత్మ స్వభావమే ద్వైతవిస్తారరూపసృష్టియై భాసిస్తుంది.



సర్వదా సర్వత్ర కేవల పరమాత్మయే శాంత (సాత్విక) చిత్తంలో శాంత రూపంగా, ఘోర (రాజస) మూఢ (తామస) చిత్తంలో ఘోరమూఢరూపాల్లో కనుపిస్తూ వుంటాడు. కాని వాస్తవికంగా పరమాత్మ అలా లేడు.

**అనువాదం** - 'ఇనుము, మట్టిముద్ద, బంగారం ఇవి గూడ వికారాన్ని పొందవు. కనుపించే చరాచర భూతాల్లో వాస్తవిక భేదం లేదు. సర్వగత నిరాధార చైతన్యాత్మయందున్న అవిద్యయే ఆత్మాశ్రయంతో స్థూలసూక్ష్మ రెండురకాల సృష్టిని చేస్తుంది. సర్పంలో రజ్జుత్వం, రజ్జువులో సర్పత్వం లేనట్లు జగదుత్పత్తినాశాలకు గూడ ఏ కారణమూ లేదు. ఈ అవిద్యాకల్పన (రచన) లోక వ్యవహారం కొరకు మాత్రమే. ఈ మాయ ద్వైతాద్వైతరూపమై వుంది. జగత్తునుమోహింప జేసేది గాన 'మోహినీ' అని గూడ చెప్పబడుతుంది. ఆత్మజ్ఞానియగువాడు ఎల్లప్పుడు పూర్ణపర బ్రహ్మమును నిష్కలం మరియు అద్వైతరూపంగానే చింతన చేయాలి. దీనివల్ల శోకరహితుడై దేనికీ భయపడడు. అతనికి మృత్యుభయం గాని మరియే ఇతర భయాదులు గూడ వుండవు. పరమ పురుష పరమాత్మకు జన్మ మరణాలు లేవు. అతను ఎవరిని చంపడు ఎవరిచేతను చంపబడడు. ఆయనకు బంధం లేదు ఎవరిని బంధంలో వేయడు. ముక్తుడుకాడు ముక్తినిచ్చేవాడూ కాడు. అతనికంటే భిన్నంగా కనుపించేదంతా అసత్యమేను. ఈరకంగా పరమాత్మ విశ్వరూపాన్ని మాయామయం మరియు మిథ్యగా అర్థం చేసుకుని అన్నిరకాల కల్పనలను విడిచి భోగాసక్తి నుండి విముక్తుడవుతాడు. పైవిధంగా సమస్త వికల్పదూరుడై మనస్సును ఆత్మయందు నిశ్చలంగా నిలిపి శాంతచిత్తుడైన యోగి పొగలేని ప్రజ్వలించే అగ్నివలె ప్రకాశిస్తూ వుంటాడు. ఇరువదినాల్గు భేదాలుగల మాయ ఈ జగత్తుకు మూలకారణం. దీనిచేతనే కామ క్రోధ లోభ మోహ భయ విషాద శోక మరియు ఇతర వికల్పాలన్నీ ఉత్పన్నమైనవి. ధర్మాధర్మ, సుఖదుఃఖ, సృష్టి వినాశరూప పరిణామాలు, నరకానికి వెళ్లడం, స్వర్గానికి

వెళ్లడం. జాతి ఆశ్రమ రాగ ద్వేష రకరకాల రోగాలు కుమారావస్థ, తరుణ వృద్ధావస్థలు, సంయోగ వియోగ భోగ ఉపవాసాదులు, వ్రతాలు ప్రకట మయ్యాయి. వీటన్నింటినీ ప్రకృతి వికారాలని తెలిసికొనే జ్ఞాని వాటన్నింటిని ప్రకృతి యందే వుంచి మౌనభావంతో వుంటాడు. అలాంటి వానినే నీవు శుభమైన బుద్ధిగలవానినిగా గ్రహించు.'

**అనువాదం - శ్రీవిష్ణు ధర్మోత్తరపురాణాంతర్గత షడధ్యాయిలో చెప్పబడిన విషయం-"** తనయందే అనాదికాలంగా సంబద్ధమై వున్న అవిద్యా యుక్తుడైన క్షేత్రజ్ఞుడు తన అంతఃకరణమందే వున్న బ్రహ్మమును భేదరూపంగా చూస్తున్నాడు. తనకంటే భిన్నంగా బ్రహ్మమును మరియు ఇతర జీవులను చూస్తున్నంత వరకు తన కర్మల ద్వారా మోహితుడై జనన మరణ సంసారంలో తిరుగుతూ వుంటాడు. తన సంపూర్ణ కర్మసంస్కారాలు క్షీణమైనప్పుడు శుద్ధ పరబ్రహ్మను తనకభిన్నంగా భావిస్తాడు. లేదా చూస్తాడు. తాను శుద్ధుడైనందున అక్షయ స్వరూపుడౌతాడు. సమస్త కర్మలు అవిద్యా స్వరూపాలు, జ్ఞానం విద్యాస్వరూపం. కర్మతో జీవునకు జన్మ వుంటుంది. జ్ఞానంతో ముక్తుడౌతాడు. అద్వైతమే పరమార్థము. దీనికి భిన్నమైన ద్వైతం అసత్యమని చెప్పబడుతుంది. ఇక అద్వైతవిషయంలో శ్రవణం చేయి. అద్వైతత్త్వం నేను నీవు నాది నీదను బుద్ధి నుండి దూరమై నిర్వికల్ప నిర్వికార అనిర్వచనీయ రూపంలో అనుభవించ బడుతుంది. ద్వైతం మనోవృత్తిరూపం. పరమార్థరూపంగా అద్వైతమే వుంది. ధర్మాధర్మకారణం చేత ఉత్పన్నమైన మానసిక వృత్తులను నిరోధించాలి. వాటినిరోధం వల్ల ద్వైతసిద్ధి కలుగదు. ఈ కనుపించే సమస్త దృశ్యం కేవలం మనస్సు సంకల్పమే. మనస్సు అమనీభావ (నశించినపుడు) మయిననపుడు అద్వైత భావం ప్రాప్తిస్తుంది. కర్మభావన బ్రహ్మానుభూతిలో విఘ్నకారకం. కర్మభావ నానుకూలంగానే విజ్ఞానం లభిస్తుంది. భావన నశించగానే పరబ్రహ్మ



అనుభవం స్వయంగా కలుగుతుంది. ఓ రాజా ! ఆత్మ పరబ్రహ్మలభేదం అజ్ఞానకల్పితం మాత్రమే. జ్ఞానం చేత అజ్ఞానం నశించినపుడు ఆత్మపరమాత్మల అభేదం నిశ్చితమవుతుంది. క్షేత్రజ్ఞుడని చెప్పబడే ఆత్మ ప్రకృతి గుణాలతో కూడుకున్నవాడు. ఆ క్షేత్రజ్ఞుడే గుణరహితుడై శుద్ధుడైనపుడు పరమాత్మ యని చెప్పబడతాడు".

## దుష్టులతో అప్రమత్తంగా వుండు

**- శ్రీ రామకృష్ణ పరమహంస**

భగవంతుని భక్తుడైనవానికి కమ్మరి దాగిలి లాగా స్థిర బుద్ధి వుండాలి. అది విరామం లేకుండా సమ్మెటపోట్లను తింటూనే వుంటుంది. అయినప్పటికీ దాన్లో ఏ మార్పు ఉండదు. దుష్టులు నిన్ను ఎంతో నిందిస్తారు. నిన్ను దుర్భాషలాడుతారు. నీవు హృదయపూర్వకంగా భగవంతుని అపేక్షిస్తే (ఆకాంక్షిస్తే) అన్నిటిని సహించుకొనే ఉండాలి. దుష్టులలో పులి, ఎలుగు బంట్ల స్వభావమే వుంది. అలాంటి వాళ్ళు వెనుక నుండి వచ్చి అపకారం తలపెడతారు.

వీళ్లను గురించి అప్రమత్తంగా ఉండాలి. దుష్టులను చూస్తే నేను ఎంతో జాగ్రత్తగా ఉంటాను. కొందరిది పాము వంటి స్వభావం. ఏలాంటి సూచనా లేకుండా హఠాత్తుగా వచ్చి కాటు వేస్తారు. కాటును తప్పించుకోవాలంటే ఎంతో అప్రమత్తత అవసరం. అప్పుడప్పుడు సాధు సాంగత్యం వుండాలి. సత్సాంగత్య ఫలితంగా సత్యం, అసత్యం గురించి వివేకం కలుగుతుంది.

నిజమైన తపన ఉంటే సంసారంలో ఉండి కూడ భగవంతుణ్ణి పొందవచ్చు. సంసారంలోని కర్తవ్యాలనన్నిటినీ నిర్వర్తించండి. కాని మనస్సును మాత్రం భగవంతునిపైనే నిలపండి. మానసికంగా (సంసారాన్ని) త్యజించి జీవించుడనే నేను చెబుతుంటాను. సంసారాన్ని వదలివేయమని చెప్పడం లేదు. సంసారంలో అనాసక్తుడవై ఉండి హృదయ పూర్వకంగా భగవంతుణ్ణి కోరుకొంటే తప్పక ఆయన్ను పొందవచ్చు.

# మంగళం - జయ మంగళం

**రచయిత - ఆచార్య కె. సర్వోత్తమరావు, (తిరుపతి)**

**( గత సంచిక తరువాయి )**

కౌసల్య "స్కన్దశ్చ భగవాన్ దేవ : " అని మొదలుపెట్టి కుమారస్వామి, సోముడు, బృహస్పతి,సప్తర్షులు, నారదాదులు 'త్వాం రక్షన్తు' అని ఆశంస తెలియజేసింది. ఆ తరువాతది త్రిమూర్తుల రక్షణ -

భారతీయులు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను త్రిమూర్తులుగా భావిస్తారు. సృష్టి స్థితిలయలు వీరి ఆధీనాలు. అందుకే కౌసల్య సామాన్య స్త్రీగా సకల లోక ప్రభువయిన శివుడు, సకల లోక ప్రభువయిన బ్రహ్మ, భూతభర్త అయిన విష్ణువు, ఋషులు మిగిలిన దేవతానీకం వనవాసు డయిన నిన్ను 'రక్షన్తు' అన్నది.

ఇవన్నీ వాగ్రూప ఆశంసలు. ఇవి చాలవు. దేవతలు హెూమాదులతో హవిస్సులతో సంతోషించేవారు. కనుక హెూమార్థం నెయ్యి, తెల్లని పుష్పమాలలు, తెల్లని ఆవాలు తెప్పించింది. హెూమ సన్నాహాలు చేసింది.

కౌసల్య మంగళాశాసనంలో రెండవభాగం - **స్వస్తి ఆకాంక్ష.**

సు+అస్తి= స్వస్తి, శుభం అగుగాక ! అని ఆశంస. సాధారణంగా ఆత్మీయులు సుదూర ప్రాంతాలకు వెళ్ళే వేళ పెద్దలు త్రికరణశుద్ధిగా స్వస్తి పలకడం సంప్రదాయం. ఈ దృష్టితో కౌసల్య 5 శ్లోకాలలో శ్రీరామచంద్రుల స్వస్తిని ఆకాంక్షించింది.

**ఆగమాస్తే శివాః సన్తు సిధ్యన్తు చ పరాక్రమాః**

**సర్వసంపత్తయే రామ స్వస్తిమాన్ గచ్ఛ పుత్రక !**



**స్వస్తి తే ఽ స్త్వాన్తరిక్షేభ్యః పార్థివేభ్యః పునః పునః**

**సర్వేభ్యశ్చైవ దేవేభ్యో యే చ తే పరిపంథినః ॥**

శ్రీరామా! నీ మార్గములు మంగళకరములగుగాక! నీ పరాక్రమం సఫలమగు గాక ! నీవు క్షేమంగా వెళ్ళి సమస్త కార్యాలను సాధించు. ఆకాశంలోని వారు, పరానుగ్రహ పాత్రులయిన భూదేవతలు, నీకు సర్వదా సంక్షేమం కలిగించెదరు గాక! నీ శత్రువులయినవారి వల్ల నీకు అపాయం కలుగకుండుగాక! అని శాంతి హెూమం చేయించింది. మధు,దధి,అక్షత, ఘృతాలతో పుణ్యాహం శ్రేష్ఠ బ్రాహ్మణుల చేత చెప్పించింది. ఈ అంశాన్ని వాల్మీకి రామునిచేత **'స్వస్తి అయన క్రియాః వాచయామాస'** అని వర్ణించాడు.

ఇక మూడవభాగం **మంగళాశాసనం.** ఈ అనుశాసనంలో 5 శ్లోకాలున్నాయి. ఇవన్నీ అర్థవంతాలు.

**యన్మంగళం సహస్రాక్షే సర్వదేవ నమస్కృతే**

**వృత్రనాశే సమభవత్ తత్తే భవతు మంగళమ్**

వృత్రాసుర సంహార సమయంలో సకల దేవతా నమస్కృతుడయిన దేవేంద్రునికి ఏ మంగళం కలిగెనో అట్టి మంగళం నీకు అగుగాక !

**యన్మంగళం సుపర్ణస్య వినతా -కల్పయత్పురా**

**అమృతం ప్రార్థయానస్య తత్తే భవతు మంగళమ్**

పూర్వం గరుత్మంతుడు అమృతం తీసుకొనిరావడానికి వెళ్ళే సమయంలో అతనికి వినత ఎలాంటి మంగళం చేసిందో ఆ మంగళం నీకును అగుగాక !

**అమృతోత్పాదనే దైత్యాన్ ఘ్నతో వజ్రధరస్య యత్**

**అదితిర్మంగళం ప్రాదాత్ తత్తే భవతు మంగళమ్**

అమృతమథన కార్యక్రమ సందర్భంలో దైత్యులను చంపడానికి తల్లి అయిన అదితి దేవేంద్రునకు ఏ మంగళం ప్రసాదించిందో ఆ మంగళం నీకు అగుగాక!

**త్రీన్విక్రమాన్ ప్రక్రమతో విష్ణో రమితేజసః**

**యదాసీన్మంగళం రామ తత్తే భవతు మంగళమ్**

రామా ! మూడు అడుగులు వేసి త్రిలోకాలను ఆక్రమించే సమయంలో సాటిలేని తేజస్సు గల విష్ణువునకు ఏ మంగళము కలిగెనో అది నీకు కలుగుగాక !

**ఋతవః సాగరా ద్వీపా వేదా లోకా దిశశ్చ తే**

**మంగళాని మహాబాహో దిశన్తు శుభమంగళాః**

మహానుభావుడయిన ఓ రామా! శుభకరములు, మంగళకరములు అయిన ఋతువులు, సముద్రాలు, ద్వీపాలు, వేదాలు, లోకాలు, దిక్కులు నీకు మంగళము చేయుగాక!

ఈ శ్లోకంలోని శబ్దజాలం బట్టి 14 ఏండ్లకాలం, సముద్రలంఘున, సేతు నిర్మాణం, ద్వీపం చేరుకోవడం లాంటివి స్ఫురిస్తాయి.

ఈ మంగళాశాసనం తరువాత కౌసల్య పుత్రుని శిరస్సుపై అక్షతలుంచి శరీరానికి గంధంపూసి ప్రసిద్ధ ఫలప్రదాత అయిన శుభకరమయిన 'విశల్యకరణి' అనే రక్షగట్టి మంత్రంతో అభిమంత్రించి వనవాసానికి అనుజ్ఞ ఇచ్చింది. ఆపై అయోధ్యాగనరవాసుల సంప్రార్థనం.

కన్నకుమారుడయిన రామునికోసం కౌసల్య బాధపడడంలో



అర్థముంది. కాని రామవనగమనం విని ఆ దృశ్యాలను చూసిన స్త్రీలు, వృద్ధులు, తరుణులు చాల ఆపుకోలేని దుఃఖంతో శ్రీరామచంద్రులవారు వనవాసానంతరం క్షేమంగా రావాలని సాయం ప్రాతస్సంధ్యలలో సమస్త దేవతలకు మొక్కుతారని వాల్మీకి వర్ణన. ఇది కూడా ఆశంసనమే!

**స్త్రియో వృద్ధాః తరుణ్యశ్చ సాయం ప్రాతస్సమాహితాః**

**సర్వాన్ దేవాన్ నమస్యంతి రామస్యార్థే హితైషిణః ॥**

